నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బస్తాలతో నిండిపోయిన మిర్చి యార్డు

ఎరుపెక్కిన యార్డు!

ఖమ్మం మార్కెట్‌కు లక్ష బస్తాల మిర్చి రాక
మిర్చి వాహనాలతో నిండిన త్రీటౌన్ ప్రాంతం
కాంటాలు, తోలకాల ఆలస్యంతో నేడు యార్డుకు సెలవు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 19 : ఎర్ర బంగారంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నిండిపోయింది. సోమవారం దాదాపు లక్ష బస్తాలు విక్రయానికి రావడంతో ఇసుకేస్తే రాలని విధంగా యార్డు తయారైంది. 2017లో ఇదే సీజన్‌లో లక్షా 50 వేల బస్తాల మిర్చి రికార్డు స్థాయిలో మార్కెట్‌కు విక్రయానికి వచ్చింది. ఆదివారం సెలవు దినం తర్వాత సోమవారం మార్కెట్ తెరుచుకోవడంతో క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. అయితే ఒకరోజు ముందుగానే ఆదివారం సాయంత్రం వరకు 40 వేల బస్తాలను తరలించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి జిల్లా రైతులతోపాటు పొరుగు జిల్లాలు, ఏపీ రాష్ట్రం నుంచి వందలాది వాహనాల్లో సరుకును మార్కెట్‌కు తీసుకురావడంతో యార్డు పూర్తిగా నిండిపోయింది.

తెల్లవారే సరికి త్రీటౌన్ ప్రాంతంలో ఎక్కడ చూసినా మిర్చి బస్తాల వాహనాలు దర్శనమిచ్చాయి. విషయం తెలుసుకున్న మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, త్రీటౌన్ సీఐ నరేశ్‌లు తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీఐ స్వయ పర్యవేక్షణలో నిలిచిపోయిన వాహనాలను వివిధ మార్గాల ద్వారా దారి మళ్లించి అపరాల యార్డుకు తరలించారు. దీంతో రెండు యార్డుల్లో మిర్చి పంటను రైతులు దిగుమతి చేశారు. ఆ తర్వాత వచ్చిన వాహనాలు మార్కెట్ సమీపంలోని వీధుల్లోనే దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. జాతీయ మార్కెట్లో మంచి ధర పలుకుతుండడంతో వ్యాపారులు పోటీపడి పంటను కొనుగోలు చేశారు. జెండా పాటలో మిర్చి పంటకు గరిష్ట ధర క్వింటా రూ.20,850 పలికింది. మధ్య రకం క్వింటా రూ.19 వేలు, కనిష్ట ధర రూ.14 వేలు పలికింది. తాలు రకం క్వింటా రూ.12 వేలతో వ్యాపారులు కొనుగోలు చేశారు. సాయంత్రం వరకు కాంటాలు, తోలకాల ప్రక్రియ పూర్తికాకపోవడంతో వ్యాపారులు, కార్మికుల అభిప్రాయం మేరకు మంగళవారం మిర్చి యార్డుకు సెలవు ప్రకటించారు.

వారంలో మూడు రోజులే క్రయవిక్రయాలు

వారంలో మూడు రోజులపాటే మార్కెట్లో క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన వర్తక సంఘం వ్యాపారులు, ట్రాలీ అసోసియేషన్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం రికార్డు స్థాయిలో పంట రావడంతో వ్యాపారులు, కార్మికుల అభిప్రాయం మేరకు మంగళవారం మిర్చి యార్డుకు సెలవు ప్రకటించారు. 21 యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు. 22, 23వ తేదీల్లో మేడారం జాతరను పురస్కరించుకొని సెలవు ఉంటుందన్నారు. 24న వారాంతపు సెలవు ఉన్నప్పటికీ మిర్చి క్రయవిక్రయాలు జరుగుతాయని, 25న ఆదివారం సెలవు ఉంటుందని తీర్మానంలో పేర్కొన్నారు. తిరిగి సోమవారం యాథావిధిగా అన్ని రకాల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేపడతామని, రైతులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని కార్యదర్శి విజ్ఞప్తి చేశారు.

మేడారం వెళ్లేందుకు నిలువెత్తు బంగారాన్ని తీసుకుంటున్న భక్తులు

జనమంతా జాతరవైపే..!

- మేడారానికి తరలివెళ్తున్న భక్తులు
- ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన ఆర్టీసీ
- ఇక్కడ మొక్కులు.. అక్కడ చెల్లింపులు
- నిలువెత్తు బంగారంతో బయలుదేరిన భక్తజనం
- 'ఆధార్' లేకున్నా మహిళలకు ఉచిత ప్రయాణం

బస్సుల కోసం కొత్తగూడెంలో వేచిచూస్తున్న జనం

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధికెక్కిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తులు భారీగా తరలివెళ్తున్నారు. జనమంతా జాతరవైపే సాగిపోతుండడంతో జిల్లాఅంతటా సందడి వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా మేడారం భక్తులే దర్శనమిస్తున్నారు. ఆటోలు, ట్రాలీలు, టాటామేజిక్‌లు, లారీల్లో సైతం కుటుంబాల సమేతంగా పయనమవుతున్నారు.దారులన్నీ మేడారం వైపే కనిపిస్తున్నాయి. గత నెలరోజుల నుంచే భక్తులు మేడారానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రతి రెండేళ్లకొకసారి జరిగే ఈ మహాజాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం సైతం అక్కడే నెలరోజులుగా విధుల్లో నిమగ్నమయ్యారు. గద్దెల మీదకు అమ్మవార్లు రాక ముందే ప్రతిరోజు లక్షలాది మంది భక్తులు అక్కడ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఇక్కడ మొక్కులు.. అక్కడ చెల్లింపులు

మేడారం జాతర ఎప్పుడు జరిగినా ఇక్కడ మొక్కులు చెల్లించుకున్నాకే జాతరకు పయనమవుతారు. దీంతో బంగారానికి(బెల్లం) బాగా డిమాండ్ పెరిగింది. స్థానికంగా గద్దెలు ఉన్న ప్రాంతాల్లో సమ్మక్క-సారలమ్మ తల్లులకు మొక్కులు చెల్లించుకుని ఇంటివద్దనే నిలువెత్తు బంగారాన్ని అమ్మవారికి అప్పగిస్తారు. స్థానికంగా జరుగుతున్న జాతరలు ఇప్పటికే పూర్తికావడంతో ఇంటివద్ద దేవునికి పెట్టుకుని మొక్కులు ఇచ్చి చెల్లింపులకు మేడారం పయనమవుతారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఇప్పటికే టీఎస్ ఆర్టీసీ మేడారం కోసం ప్రత్యేక బస్సులను సిద్ధం చేసి ఆయా డిపోల పరిధిలో ప్రారంభించడం కూడా జరిగింది. డిపోల పరిధిలో బస్సులు సరిపోకపోతే ఇతర ప్రాంతాల నుంచి కూడా బస్సులను రప్పించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ డిపోల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి చలువ పందిర్లను సమకూర్చారు. కొత్తగూడెం నుంచి 130, ఇల్లెందు 124, పాల్వంచ 45, మణుగూరు 25, భద్రాచలం 50 బస్సులతోపాటు చర్ల 10, టేకులపల్లి 25 బస్సులను ఏర్పాటు చేశారు. మంగపేట, ఏటూరునాగారంలో ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. బస్సుల రద్దీ కారణంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణానికి ఆధార్‌కార్డు అందుబాటులో లేకపోయినా ప్రయాణం చేసే వెసులుబాటు కూడా కల్పించారు. దీంతో మహిళలకు కొంత ఊరట కలిగింది. బస్సుల్లో మేడారం వెళ్లే ప్రతి మహిళకు ఉచిత ప్రయాణం కల్పించారు ఆర్టీసీ అధికారులు.

లోకల్ మేడారంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ప్రతి ఏటా మొక్కులు చెల్లిస్తున్నం..

మేడారం సమ్మక్క అంటే మాకు నమ్మకం. అందుకే ప్రతి ఏటా మొక్కులు చెల్లించుకుంటాము. జాతర నాడు బాగా బిజీ ఉంటుందని ముందుగానే వెళ్తున్నాము. ఇప్పటికే చాలా జనం వచ్చారట. అయినా అమ్మ దర్శనం కోసం ఎంత జనం ఉన్నా వెళ్లాల్సిందే.

- అనుదీప్, భక్తుడు, సుజాతనగర్

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం..

మేడారం వెళ్లే భక్తుల కోసం సకల ఏర్పాట్లు చేశాం. చలువపందిళ్లను సైతం ఏర్పాటు చేసి సరిపడా ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాము. పాల్వంచలో కూడా కౌంటర్ పెట్టాము. బస్సు నిండిన వెంటనే పంపిస్తున్నాం. బస్సులో ప్రయాణం చేయడం వల్ల అందరూ గద్దెల దగ్గరకు వెళ్లే అవకాశం ఉంటుంది. మేడారం వద్ద కూడా ఆర్టీసీ బస్టాండ్ ఉంది. మన జిల్లా బస్సులు అందుబాటులో ఉంటాయి. తిరుగు ప్రయాణం కూడా సులువుగా ఉంటుంది.

- బాణాల వెంకటేశ్వరరావు, డీఎం, కొత్తగూడెం

బాధ్యతలు చేపట్టిన జిల్లా అధికారులు

కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న డీఏవో బాబూరావు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లా అధికారుల బదిలీలు జరిగాయి. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ అధికారిగా బాబూరావు, జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్‌గా తిరుపతయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రియాంక ఆలను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క, పుష్పగుచ్ఛాన్ని అందించారు.

కొత్తగూడెం బస్టాండ్‌లో జనం రద్దీ

మొర్రేడు రాను.. పోసుకపోను..!

- కాసులు కురిపిస్తున్న ఇసుక అక్రమ రవాణా
- కొందరు నాయకులు, అధికారుల అండదండలతో యథేచ్ఛగా వ్యాపారం
- అనుమతి లేకుండా రాత్రికి రాత్రే ట్రాక్టర్లలో తరలింపు
- ఒక్కో ట్రాక్టర్‌కు రూ.8 వేల నుంచి రూ.10 వేల చొప్పున విక్రయం
- ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్న అక్రమార్కులు

వాగులో ఇసుకను ట్రాక్టర్‌లోకి లోడు చేస్తున్న కూలీలు

టేకులపల్లి సెంటర్‌లో రాత్రి సమయంలో వేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

టేకులపల్లి, ఫిబ్రవరి 19 : మొర్రేడు వాగు ఇసుక రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడ ర్యాంపులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో కొందరు అక్రమార్కులు ఇదే అదనుగా భావించి రాత్రికే రాత్రే ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తూ లక్షలు గడిస్తున్నారు. దీంతో స్థానిక గ్రామపంచాయతీలతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఆమ్యామ్యాలకు అటవాటుపడిన సంబంధిత శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టేకులపల్లి మండలం శంభునిగూడెం వద్ద 2018కి ముందు ప్రభుత్వ అనుమతితో ఇసుక ర్యాంపు ఏర్పాటు చేశారు. దాని ద్వారా గ్రామపంచాయతీకి, ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. ఆ తర్వాత ప్రభుత్వం ర్యాంపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. ఈ క్రమంలో మొర్రేడు వాగు పరీవాహకంలోని శంభునిగూడెం, చంద్రుతండా, సంపత్‌నగర్, మేల్లమడుగు, గంగారం, లచ్చగూడెం, బోడు, బొమ్మనపల్లి, జంగాలపల్లి, మొట్లగూడెం వద్ద ముర్రేడు వాగు ప్రాంతాల్లో సహజంగానే ఇసుకను తరలించడానికి బాటలు ఉన్నాయి. దీంతో ఇసుకాసురులు అధికార పార్టీ నాయకుల అండదండలతోపాటు కొందరు ప్రభుత్వ అధికారులను మచ్చిక చేసుకొని రాత్రి సమయాల్లో ఇసుకను తరలించడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి ఇల్లెందు, కారేపల్లి, కొత్తగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాలకు ఇసుకను తరలించి.. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ల మితిమీరిన వేగంతో ప్రమాదాలు

ఏజెన్సీ గ్రామాల్లో రాత్రి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా మితిమీరిన వేగంతో అక్రమంగా ఇసుకను తరలించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వాహనదారులతోపాటు బాటసారులు ప్రాణాలు కోల్పోతున్నారు. నిరుపేద ట్రాక్టర్ డ్రైవర్లకు డబ్బుల ఆశ చూపి రాత్రి సమయాల్లో ఎక్కువగా వారిని వినియోగించుకుంటున్నారు. ఉన్నతాధికారులు ట్రాక్టర్ల వేగాన్ని నియంత్రించకపోతే మున్ముందు మరింత మంది ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంది. అంతేకాక మండలం నుంచి ప్రతి రోజు 80 నుంచి 120 ట్రాక్టర్ల ఇసుకను ఇతర ప్రాంతాలకు రాత్రి సమయంలోనే రవాణా చేస్తున్నారంటే వారి అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

పెద్దిపల్లిలో ర్యాంపులో తవ్వకాలు నిలిపివేత

నిలిచిపోయిన ఇసుక తవ్వకం పనులు

చర్ల, ఫిబ్రవరి 19 : పెద్దిపల్లి గిరిజన సొసైటీ ద్వారా అనుమతి పొందిన ఇసుక ర్యాంపులో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టిన అధికారులు తవ్వకాలు నిలిపివేశారు. పేరుకు గిరిజన సహకార సంఘం అయినప్పటికీ పెత్తనం అంతా అక్రమార్కులదే కావడంతో తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్న సామెతలా ఉంది పరిస్థితి. ఈ ర్యాంపులో నిబంధనల ప్రకారం కాకుండా యంత్రాలతో ఇసుకను తవ్వుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే తమకు అందిన సమాచారం మేరకు జిల్లా అధికారులు.. స్థానిక అధికారులను దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ భరణిబాబు, మైనింగ్ ఏడీ జైసింగ్.. పెద్దిపల్లి ర్యాంపు వద్దకు వెళ్లి దర్యాప్తు చేశారు. వెంటనే అక్రమ తవ్వకం పనులను నిలిపివేశారు. నిర్వాహకులకు జరిమానా సైతం విధించారు.

అతి వేగంతో భయమేస్తోంది..

మా ఇల్లు రోడ్డు పక్కనే ఉంది. అక్రమ ఇసుక రవాణా రాత్రి సమయంలో చేస్తుండడంతో ఆ శబ్దానికి నిద్ర కూడా పట్టడం లేదు. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడుపుతుండడంతో బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే బాగుంటుంది.

- బానోతు హల్యానాయక్, చంద్రుతండా

ర్యాంపునకు అనుమతి ఇవ్వాలి

శంభునిగూడెం పంచాయతీ పరిధిలో ఇసుక అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతున్నది. ప్రభుత్వం ఇక్కడ ర్యాంపునకు అనుమతి ఇస్తే రాత్రి వేళల్లో ఇసుక తరలింపు ఆగిపోతుంది. పగలు మాత్రమే తరలించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

- బట్టు విజయ్‌కుమార్, శంభునిగూడెం

కఠిన చర్యలు తీసుకుంటాం..

మండల పరిధిలో రాత్రి, పగలు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రోడ్లపై ట్రాక్టర్లు అతి వేగంగా వెళ్లడంతోపాటు ఎక్కడైనా ఇసుక రవాణా జరిగితే వెంటనే మాకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. ఇసుక రవాణాదారులపై కేసులు నమోదు చేస్తాం.

- సైదా రవూఫ్, ఎస్సై

మూడు నియోజకవర్గాల అభివృద్ధికి రూ.2.10 కోట్లు

బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా

మామిళ్లగూడెం, ఫిబ్రవరి19 : జిల్లాలోని ఖమ్మం, మధిర, పాలేరు నియోజకవర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఆయా ప్రాంతాల అభివృద్ధికి ఎంపీ నిధులు రూ.2,10,60,000 మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ రోడ్లు, కల్వర్టులు, పాఠశాలలు, అంగన్‌వాడీ, హెల్త్ సబ్ సెంటర్ల ప్రహరీల నిర్మాణానికి ఎంపీ నిధులు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రఘునాథపాలెం మండలం మల్లేపల్లి, బద్యాతండా, హర్యాతండా, మధిర మండలం కృష్ణాపురం, నాగవరప్పాడు, ఇల్లూరు, ముదిగొండ మండలం పెద్దమండవ, ఖానాపురం, వల్లభి, గోకినేపల్లి, ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం, అయ్యవారిగూడెం, ఇనగాలి, జమలాపురం, కొత్తపాలెం, నర్సింహాపురం, భీమవరం, బోనకల్లు మండలం గోవిందాపురం, రావినూతల, నారాయణపురం, పెద్దబీరవల్లి, చింతకాని, మండలం అనంతసాగర్, పాతర్లపాడు, బొప్పారం, నాగులవంచ, నాగిలిగొండ, నేలకొండపల్లి మండలం సదాశివపురం, తిరుమలాయపాలెం మండలం జల్లెపల్లి, ఎర్రగడ్డ, భద్రాద్రి కొత్తగూడెం బాబు క్యాంప్, జూలూరుపాడు మండలం పాపకొల్లు(కొత్తూరు) గ్రామాల్లో మంజూరైన ఎంపీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాగా.. మూడు నియోజకవర్గాల్లో చేపట్టనున్న పనులకు త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా గ్రామాల పురోభివృద్ధికి భారీగా ఎంపీ నిధులు ఖర్చు చేసినట్లు ఎంపీ నామా పేర్కొన్నారు.

క్రీడలతోనే ఆత్మవిశ్వాసం

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 19 : క్రీడలతోనే ఆత్మవిశ్వాసం, స్నేహభావం పెంపొందుతుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. దుమ్ముగూడెం వైద్యశాల పక్కన క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తెల్లం మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యువత చెడువైపు కాకుండా.. ఆటలపై దృష్టి సారించి మంచి క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అనంతరం ప్రీమియర్ లీగ్‌లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు, షీల్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, ఎంపీపీ రేసు లక్ష్మి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు(శివాజీ), క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో వీగిపోయిన అవిశ్వాసం

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగనున్న కాపు సీతాలక్ష్మి

విలేకరులతో మాట్లాడుతున్న ప్రిసైడింగ్ అధికారి మధు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 19 :కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిపై మున్సిపల్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మొత్తం కౌన్సిల్ సభ్యులు 36 మంది, ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఒకరు మొత్తం 37 మంది ఉండగా అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు 2/3 వంతు అంటే కనీసం 25 మంది కౌన్సిల్ సభ్యులు అవసరంకావడంతో నిర్ణీత సమయానికి ఒక్క కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరయ్యారు.. అవిశ్వాసాన్ని ప్రతిపాదించిన కౌన్సిలర్లు ఎవరూ హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి డి.మధు ప్రకటించారు. దీంతో యథావిధిగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాపు సీతాలక్ష్మి కొనసాగనున్నారు. వివరాల్లోకెళ్తే.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిసైడింగ్ అధికారి డి.మధు ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 11:30 గంటల వరకు ఒక్క కౌన్సిలర్ కూడా హాజరుకాలేదు. దీంతో మున్సిపల్ చట్టం ప్రకారం కౌన్సిలర్లు హాజరయ్యేందుకు మరో అవకాశాన్ని అధికారులు కల్పించారు. మధ్యాహ్నం 2గంటల వరకు అవకాశం ఇచ్చినప్పటికీ 28వ వార్డు కౌన్సిలర్ మండల ఆమని మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేనందున అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి విలేకరుల ఎదుట ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, తహసీల్దార్ డి.పుల్లయ్య పాల్గొన్నారు.

రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తా..

కొత్తగూడెం పట్టణాభివృద్ధికి రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తెలిపారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయిన అనంతరం ఆమె 'నమస్తే'తో మాట్లాడారు. నిజాయితీ, ధర్మం గెలిచిందని, కొంతమంది ప్రలోభాలకు లొంగి, పదవీ వ్యామోహంతో తనపై అవిశ్వాస తీర్మానం పెట్టారని, కానీ కౌన్సిలర్లు తనవైపు ఉండడం వల్ల అవిశ్వాసం వీగిపోయిందన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

- సీతాలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్